అభివృద్ధి పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో భాగంగా ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లను గురువారం కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నూతన డ్రైనేజీ లైన్‌ నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయని త్వరలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టి యుద్ధప్రాతిపదికన పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్‌, సమ్మారెడ్డి, శివరాజ్‌ గౌడ్‌, జాన్‌, భాస్కర్‌, శ్రీనివాస్‌, ప్రదీప్‌, రవి, కృష్ణ, నరసింహ, ప్రసాద్‌, శ్యామ్సన్‌, విక్రమ్‌, వర్కు ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, శ్రీనివాస్‌, సూపర్‌వైజర్‌ శివ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా వారాహిదేవి



రాయదుర్గం: వారాహి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నానక్‌రాంగూడ సర్వీస్‌ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం వారాహి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు.

వర్షాకాలం.. గుంతలు పూడ్చండి



అలకాపూర్‌ టౌన్‌షిప్‌ రోడ్డు నంబర్‌ 16లో గుంతలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో గుంతల్లో వర్షం నీరు నిలిచి కనపడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోయారు. మున్సిపల్‌ అధికారులు స్పందించి ప్యాచ్‌ వర్క్‌లను చేయించాలని వారు కోరుతున్నారు.

పరామర్శ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్‌టీఆర్‌ నగర్‌ కాలనీకి చెందిన మల్లేష్‌ చికిత్స అనంతరం ఇటీవల ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్‌ అయి ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణగౌడ్‌, సమ్మారెడ్డి, శివరాజ్‌ గౌడ్‌, వాసుదేవరావు, పోశెట్టి గౌడ్‌, కాజా, కటిక రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలను తొలగించండి

మియాపూర్‌ : రోడ్ల పక్కన చెట్లకొమ్మలు, చెత్త చెదారంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు దర్శనమిస్తున్నాయి. విద్యుత్‌ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను విద్యుత్‌ శాఖ అధికారులు తొలగించి అలాగే వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కొమ్మలు ఉన్నచోట స్థానిక ప్రజలు చెత్త వేయడంతో కాలనీ, బస్తీలలో రోడ్లు అపరిశుభ్రంగా మారాయి. వర్షాలు పడితే ఆకులు, కొమ్మలు కుళ్లిపోయి దోమలు ప్రబలుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టాలి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్‌: ప్రత్యేక బృందాలతో జిల్లాలోని రసాయన పరిశ్రమల్లో సమగ్ర తనిఖీలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా నేటి వరకు శిథిలాల తొలగింపు పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని నెమ్మదిగా జరుగుతుందని, వేగవంతం చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లాలోని అన్ని రసాయన పరిశ్రమల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. చాలా పరిశ్రమలో పాత యంత్రాలు, అనుభవం లేని కార్మికులతో ప్రొడక్షన్‌ దగ్గర పని చేయిస్తున్నా అధికారులకు కనిపించకపోవడం దారుణమన్నారు. రియాక్టర్ల దగ్గర అనుభవం ఉన్న కార్మికులే విధులు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రభుత్వం రసాయన పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చదువు చెబుతూ.. శిక్షణ ఇస్తూ..

ఉపాధికి బాటలు వేస్తున్న ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌



రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్‌ క్యాంపస్‌లో చర్మకారులకు చెప్పులు, షూల తయారీపై శిక్షణ ఇస్తున్న ఫ్యాకల్టీ (ఫైల్‌)

రాయదుర్గం: దక్షిణాదిలో ఫుట్‌వేర్‌ రంగంలో ఉన్నత విద్యాసంస్థగా ఎదిగిన ఫుట్‌వేర్‌ డిజైన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌ (ఎఫ్‌డీడీఐ)–హైదరాబాద్‌ క్యాంపస్‌ నేడు ఉత్తమ శిక్షణకు చిరునామాగా మారింది. కళాకారులు, ఇతరులకు నైపుణ్యాలను నేర్పించడానికి దశలవారీగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ క్యాంపస్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌. తేజ్‌లోహిత్‌రెడ్డి నాయకత్వంలో రక్షణశాఖ ఉద్యోగులకు సైతం శిక్షణ ఇచ్చి తమ సత్తాను చాటారు. మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



రాయదుర్గం ఎఫ్‌డీడీఐ - హైదరాబాద్‌ ప్రధాన భవనం

తాజాగా రక్షణశాఖ ఉద్యోగులకు సర్టిఫికెట్‌ కోర్సు

- ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ క్యాంపస్‌, రక్షణ శాఖలోని డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ ఎక్స్‌ సర్వీస్‌మెన్‌ వెల్ఫేర్‌ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్‌ జనరల్‌ ఆఫ్‌ రీసెటిల్‌మెంట్‌(డీజీఆర్‌) పర్యవేక్షణలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సర్టిఫికెట్‌ కోర్స్‌ ఇన్‌ రిటైల్‌ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- విశ్రాంత ఉద్యోగులు 22 మందిని ఎంపిక చేసి వారికి రాయదుర్గం ఎఫ్‌డీడీఐలో శిక్షణ ప్రారంభించారు.
- రోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ ఇస్తారు.
- ముఖ్యంగా వినియోగదారులకు అందించాల్సిన సేవలు, అమ్మకాల పద్ధతులు, మెళకువలను నేర్పిస్తున్నారు.

చెప్పులు, షూ తయారీపై శిక్షణ

- కేంద్ర ప్రభుత్వ ఆదేశంపై ఎఫ్‌డీడీఐ, ఖాదీ అండ్‌ విలేజ్‌ ఇండస్ట్రీస్‌ కమిషన్‌(కేవీఐసీ) సంయుక్తంగా చర్మకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు
- మూడు విడతలలో 25 రోజులపాటు శిక్షణ ఇచ్చారు
- శిక్షణలో అనేక మెళకువలను నేర్చుకున్నామని చర్మకారులు పేర్కొన్నారు

మహిళలకూ నేర్పేందుకు..

- మహిళలు స్వయం సంవృద్ధి బాట పట్టేలా శిక్షణ ఇవ్వాలని ఎఫ్‌డీడీఐ భావిస్తోంది.
- జనపనారతో రకరకాల బ్యాగులు, చెప్పులు, టోపీల తయారీపై మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని సంకల్పించినట్లు డాక్టర్‌ రాంబాబు వివరించారు. –మహిళలు సిద్ధంగా ఉంటే శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు.

నిరంతర సాధనతో అద్భుత ఫలితాలు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ శ్రీకాంత్‌

ఆల్విన్‌కాలనీ: నిరంతర సాధనతో క్రీడల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని వివిధ కాలనీల్లోని యూత్‌ సభ్యులకు గురువారం వాలీబాల్‌, షటిల్‌, క్యారంబోర్డులు, చెస్‌ తదితర క్రీడా సామగ్రిని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, హరినాథ్‌, ఎండీ ఇబ్రహీం, రాంచందర్‌, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమోహన్‌ సాగర్‌, లింగయ్య, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు పూర్వ వైభవం తెస్తాం..

కార్పొరేటర్‌ నాగేందర్‌ యాదవ్‌



శేరిలింగంపల్లిలో చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌, ఇరిగేషన్‌ అధికారులు

శేరిలింగంపల్లి: చెరువులకు పూర్వ వైభవం తీసుకువస్తామని శేరిలింగంపల్లి కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌ తెలిపారు. శేరిలింగంపల్లి గోపి చెరువు, చాకలి చెరువులను ఇరిగేషన్‌ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్‌ మాట్లాడుతూ చెరువులలోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌ డీఈ నళిని, ఏఈ శశాంక్‌, మాజీ కౌన్సిలర్‌ సోందాస్‌, నాయకులు రవీందర్‌గౌడ్‌, గోపాల్‌ యాదవ్‌, రాజ్‌కుమార్‌, ఆదర్శనగర్‌ కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రను ప్రారంభించిన మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ నరేందర్‌

మణికొండ: భక్తి కుటీర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మణికొండ మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం గోల్డెన్‌ టెంపుల్‌ నుంచి ప్రారంభమైన రథయాత్ర చింతచెట్టు సర్కిల్‌, అలకాపూర్‌ టౌన్‌షిప్‌ మీదుగా సైకిలా గేటెడ్‌ కమ్యూనిటీ వరకు కొనసాగింది. గోల్డన్‌ టెంపుల్‌ వద్ద పూజలు నిర్వహించి మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కె. నరేందర్‌ముదిరాజ్‌ రథయాత్రను ప్రారంభించారు. అనంతరం కాలనీలలో భక్తులు స్వామి వారికి పూజలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతర సైకిలా గేటెడ్‌ కమ్యూనిటీలోని హాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాధే శ్యాందాస్‌ మాట్లాడుతూ జగన్నాథుని కొలిచిన వారికి అన్నీ దక్కుతాయన్నారు. అనంతరం కీర్తనలు, దర్శనాలు, మహాహారతి, మహాప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు. రథయాత్రలో కాంగ్రెస్‌ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్‌, నాయకులు కిరణ్‌కుమార్‌, బి.ముత్యాలు, ప్రభావతి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థికి ఎఫ్‌ఆర్‌టీ స్కాలర్‌షిప్‌



ప్రణవ్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ విద్యార్థికి అరుదైన అవకాశం లభించింది. విద్యార్థి ప్రణవ్‌ ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలోని ఆస్ట్రేలియన్‌ నేషనల్‌ యూనివర్సిటీ (ఏఎన్‌యూ)లో 11 వారాల ఫ్యూచర్‌ రీసెర్చ్‌ టాలెంట్‌(ఎఫ్‌ఆర్‌టీ) ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. హెచ్‌సీయూలో స్కూల్‌ ఆఫ్‌ ఎకనామిక్స్‌లో ఇంటిగ్రేటెడ్‌ ఎంఏ. ఎకనామిక్స్‌ చదువుతున్నారు. ఈ ప్రాజెక్టు అగ్రశ్రేణి భారతీయ సంస్థల నుంచి అత్యుత్తమ విద్యార్థులలో పరిశోధన సహకారం, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

హత్యాయత్నం కేసులో యువకుడు రిమాండ్‌

గచ్చిబౌలి: బావపై బ్లేడ్‌తో దాడి చేసిన బావమరిదిని రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గౌలిదొడ్డిలోని బసవతారకనగర్‌లో నివాసం ఉండే కొమిరి రామకృష్ణను అతని కొడుకు కొమిరి శంకర్‌(19) తరచుగా కొడుతుండటంతో రామకృష్ణ హెచ్‌సీయూ వద్ద ఉండే తన అల్లుడు గిరికి విషయం చెప్పాడు. దీంతో గిరి జూలై 1న సాయంత్రం 7.30 గంటలకు అత్తవారి ఇంటికి వచ్చాడు. తండ్రిని బాగా చూసుకోవాలని బావ గిరి సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా బ్లేడ్‌తో మెడపై గాయపరచడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా 11 కుట్లు పడ్డాయి. ఆస్పత్రి నుంచి తిరిగి వచ్చిన గిరి బుధవారం తన బావమరిది శంకర్‌ తనను చంపేందుకు ప్రయత్నించాడని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శంకర్‌ను గురువారం రిమాండ్‌కు తరలించారు.

అరుదైన శస్త్రచికిత్స



మాదాపూర్‌: మెడికవర్‌ వైద్యబృందం అరుదైన శస్త్రచికిత్స ద్వారా ప్రాణాన్ని కాపాడారు. మాదాపూర్‌లోని మెడికవర్‌ ఆస్పత్రిలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్‌ అజయ్‌ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ నందితాపాల్‌ (35) తీవ్రమైన యోని రక్తస్రావంతో హిమోగ్లోబిన్‌ స్థాయి కేవలం 3.7 జీఎంగా ఉండగా అత్యవసర విభాగంలో చేరారు. అత్యవసర మయోమెక్టమీని (ఫైబ్రాయిడ్‌ను తొలగిస్తు గర్భాశయాన్ని సంరక్షించే ప్రక్రియ) చేయాలని నిర్ణయించారు. శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావాన్ని తగ్గించేందుకు తాత్కాలిక గర్భాశయ ధమని అడ్డుకునే అధునాతన సాంకేతికతను ఉపయోగించినట్లు తెలిపారు. నందిత ఆరోగ్యంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు పృథ్వీపెరుమ్‌, డా.శిల్ప తదితరులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

మియాపూర్‌ : తల్లి, బిడ్డ ఆరోగ్య సంరక్షణే లక్ష్యమని లోటస్‌ ఉమెన్‌, చిల్డ్రన్‌ ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్‌ వీఎస్‌వి.ప్రసాద్‌ అన్నారు. మియాపూర్‌లో లోటస్‌ ఉమెన్‌, చిల్డ్రన్‌ ఆసుపత్రి –2 యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. గైనకాలజీ, నియోనాలాజీ, పీడియాట్రిక్స్‌ నిపుణుల బృందం సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు భవాని, అనూష, లావణ్య, కమలాకర్‌ రావు, కె. పవన్‌ కుమార్‌, షేక్‌ జిలానీ బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలుడు క్షేమం..

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలి డివిజన్‌ తారానగర్‌ సెక్షన్‌ రాజీవ్‌ స్వగృహ 11 కేవీ విద్యుత్‌ ఫీడర్‌ సమీపంలో క్రికెట్‌ ఆడుతూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన బాలుడు మాస్టర్‌ రుద్ర ప్రతాప్‌సింగ్‌ క్షేమంగా ఉన్నట్లు ఆయన తండ్రి అమిత్‌సింగ్‌ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆరంభ్‌ టౌన్‌షిప్‌కి చెందిన మాస్టర్‌ రుద్రప్రతాప్‌సింగ్‌ విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. చికిత్స తర్వాత బాలుడు కోలుకున్నట్లు తెలిపారు. మాస్టర్‌ రుద్రప్రతాప్‌ సింగ్‌ విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు వచ్చిన కథనాల్లో వాస్తవం లేదన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి బాలుడి ప్రమాదానికి కారణమైన విద్యుత్‌ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎఫ్‌ఓబీ నిర్మించాలని వినతి



దక్షిణ మధ్య రైల్వే మేనేజర్‌ ఉదయ్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్‌: ప్రజల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని బుద్వేల్‌ రైల్వే స్టేషన్‌ వద్ద ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ) లేదా అండర్‌ పాస్‌ను నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్‌ నారగూడెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల బృందం దక్షిణ మధ్య రైల్వే మేనేజర్‌ ఉదయ్‌నాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేతాజీనగర్‌ కాలనీ, శ్రీరాంనగర్‌ కాలనీ, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంత ప్రయాణికులతో పాటు విద్యార్థులు, వృద్ధులు బుద్వేల్‌ రైల్వేస్టేషన్‌కు వస్తుంటారని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల సౌకర్యార్థం బుద్వేల్‌ రైల్వే స్టేషన్‌ వద్ద ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ) లేదా అండర్‌ పాస్‌ను నిర్మించాలన్నారు. ప్రస్తుతం బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు సుమారు 4 కిలోమీటర్ల మేర అదనంగా నడవాల్సిన దుస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాజేంద్రనగర్‌ అసెంబ్లీ కన్వీనర్‌ పొన్నమోని మల్లేష్‌ యాదవ్‌, రంగారెడ్డి జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నెల్లుట్ల జగన్‌, చేవెళ్ల బీజేపీ సోషల్‌ మీడియా కన్వీనర్‌ సోల్కర్‌ రెడ్డి, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు సబాదా విజయ్‌కుమార్‌, రాజు, రామారావు, చంద్రశేఖర్‌, శంకర్‌, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

6 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎండిఎంఏ, సెల్‌ఫోన్‌

గచ్చిబౌలి: ఎండిఎంఏ డ్రగ్‌ను రాయదుర్గం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బహదూర్‌పురాకు చెందిన డ్రగ్‌ పెడ్లర్‌ ఒమర్‌ అలీ(23) రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద పల్సర్‌ బైక్‌తో ఉండగా విశ్వసనీయ సమాచారంతో పోలీసులు సోదా చేయగా అతని 6 గ్రాముల ఎండిఎంఏ లభించింది. డ్రగ్‌తో పాటు పల్సర్‌ బైక్‌, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్‌ చేశారు.

15 రోజుల్లో ఓటర్‌ కార్డు



బూత్‌ లెవెల్‌ ఆఫీసర్స్‌ శిక్షణ కార్యక్రమంలో డీసీ వంశీకృష్ణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో గురువారం బీఎల్‌ఓలకు శిక్షణ ప్రారంభమైంది. వెబ్‌సైట్‌లో ఓటరుగా దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లోనే ఓటర్‌ కార్డు అందించే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 10 రోజుల పాటు నియోజకవర్గంలో వున్న బీఎల్‌ఓలకు మూసాపేట డిప్యూటీ కమిషనర్‌ వంశీకృష్ణ నేతృత్వంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పదిహేను రోజుల్లో ఇంటికే ఓటర్‌ కార్డు వచ్చే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం కొత్త సంస్కరణలు చేపట్టడంతో పాటు ఎన్నికల్లో ఓటింగ్‌ శాతం పెంచటం కోసం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు దేశ వ్యాప్తంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తుంది. అందులో భాగంగా 45 మంది బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. అందులో 6ఏ, 7ఏ, 8ఏ దరఖాస్తు ఫారంలను నింపే ప్రక్రియతో పాటు ఓటర్‌ నమోదు అయిన మార్పు, చేర్పులను, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి చిరునామా మార్పు చేసుకునే వారికి ఏ విధంగా సహాయపడవలసి ఉంటుందోనని బీఎల్‌ఓలకు వివరించారు. ఇప్పుడు ఉన్న సిస్టమ్‌ ప్రకారం ఓటర్ల ఎలక్ట్రో ఫోటో ఐడెంటిటీ కార్డు చేయడానికి నెలకు పైగా సమయం పడుతుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని ప్రవేశపెట్టింది. కూకట్‌పల్లి నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి ఎపిక్‌ జనరేట్‌ చేసినప్పటి రోజు నుంచి పోస్టల్‌ ద్వారా చేరేంత వరకు ఓటర్‌కు ఎస్‌ఎంఎస్‌ ద్వారా సమాచారం అందించి 15 రోజుల్లో కార్డు అందే విధంగా కొత్త సంస్కరణలు తీసుకువచ్చారు. ఈ విధంగా నియోజకవర్గంలోని 400 మంది బీఎల్‌ఓలకు 10 రోజుల పాటు డిజిటల్‌ శిక్షణ యిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏఈఆర్‌ఓలు కూడా పాల్గొన్నారు.

సైబర్‌ భద్రతపై అవగాహన అవసరం..



ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో సైబర్‌ సెక్యూరిటీ కౌన్సిల్‌ ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి విద్యార్థులకు సైబర్‌ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఎస్‌ఏసీఏ సైబర్‌ సెక్యూరిటీ కన్సార్టియం బోర్డు కార్యదర్శి రాజీవవర్‌, సైబర్‌ సెక్యూరిటీ రంగ నిపుణురాలు, భద్రతా పరిశోధకురాలు లలిత ఇంటరాక్టివ్‌ సైబర్‌ సెక్యూరిటీ సదస్సు నిర్వహించారు. డిజిటల్‌ ప్రపంచాన్ని సురక్షితంగా, బాధ్యతాయతంగా నావిగేట్‌ చేయడానికి అవసరమైన జ్ఞానం, ఆచరణాత్మక వ్యూహాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడం ఈ సెషన్‌ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆన్‌లైన్‌ బెదిరింపులు, వ్యక్తిగత డేటా దుర్వినియోగంపై పెరుగుతున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ రిసోర్స్‌ పర్సన్‌ పాస్‌వర్డ్‌ రక్షణ, ఫిషింగ్‌ స్కామ్‌లు, సైబర్‌ బెదిరింపు, డేటా గోప్యత, సోషల్‌ మీడియా ప్రమాదాలు, సురక్షిత బ్రౌజింగ్‌ అలవాట్లతో సహా కీలక అంశాలపై చర్చించారు. డిజిటల్‌ బాధ్యత ప్రాముఖ్యతను విద్యార్థులు అర్థం చేసుకోవడానికి నిపుణులు నిజ జీవిత ఉదాహరణలు, కేస్‌ స్టడీలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్‌ ఆధారిత యుగంలో యువతకు సైబర్‌ అవగాహన ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన డిజిటల్‌ పౌరులుగా మారాలని, ఏదైనా అనుమానాస్పద ఆన్‌లైన్‌ కార్యకలాపాలను వెంటనే నివేదించాలని కోరారు.

ట్రాఫిక్‌ చక్రబంధంలో జంక్షన్‌లు

- గండిపేట మండల పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్‌ సమస్య
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



మైహోం సర్కిల్‌లో ట్రాఫిక్‌ జామ్‌

మణికొండ: నగర శివారులో హాయిగా ఉందామని ఇళ్లు కట్టుకుంటున్నారు. అలాగే సంస్థలకు సమీపంలో ఉంటే రాకపోకలకు సునాయాసంగా ఉంటుందనే ఉద్దేశంతో ఐటీ ఉద్యోగులు ఇక్కడికే తమ మకాం మారుస్తున్నారు.హైదరాబాద్‌ నగరంలో ట్రాఫిక్‌, కాలుష్యం సమస్యలతో సతమతమయ్యే వారు వాటికి దూరంగా ఉండడానికి శివారు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇలా ప్రజలు హైదరాబాద్‌ శివారులో, ఐటీ సంస్థలకు సమీపంలో ఉన్న గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి, బండ్లగూడ జాగీర్‌ మున్సిపాలిటీలలో ఉండడానికి ఇష్టపడుతున్నారు. దీంతో ఇబ్బడిముబ్బడిగా గేటెడ్‌ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం సాగింది. ఐతే పరిస్థితి తలకిందులవుతుంది. నగరంలో ఎదుర్కొన్న ఇబ్బందులే ఇక్కడా పునరావృతం అవుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. వంద అడుగుల రోడ్లు సరిపోని పరిస్థితి తయారయ్యింది. దీంతో ఏ జంక్షన్‌, సర్కిల్‌ చూసినా అనుదినం ట్రాఫిక్‌ సమస్యలు ఎదురవుతున్నాయి. ఇంట్లో నుంచి రోడ్డుపైకి రావాలంటేనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుందని వాపోతున్నారు. ఉన్న రోడ్లకు, పెరుగుతున్న ట్రాఫిక్‌ను కంట్రోల్‌ చేయలేక ట్రాఫిక్‌ పోలీసులు చేతులెత్తేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

రాబోయే రోజుల్లో..

గండిపేట మండల పరిధిలో ఇప్పటికే లెక్కకు మించి అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్‌ కమ్యూనిటీలు, టవర్‌లు వెలిశాయి. వేలాది కుటుంబాలు వచ్చి చేరాయి. దీంతో ట్రాఫిక్‌ సమస్య పెరిగిపోయింది. మణికొండ మున్సిపాలిటీలో 1.50 లక్షలు, నార్సింగి మున్సిపాలిటీలో 2 లక్షలు, బండ్లగూడ మున్సిపాలిటీలో లక్ష వరకు జనాభా పెరిగి పోయిందని ఆయా మున్సిపాలిటీలు, జలమండలి అధికారుల లెక్కలు చెపుతున్నాయి. స్థానికంగా నివసిస్తున్న వారితో పాటు పాఠశాలలు, కళాశాలలు, ఫాంహౌస్‌లకు ఆయా మున్సిపాలిటీల మీదుగా నిత్యం లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇంకా నిర్మాణం పూర్తి చేసుకున్న వాటిల్లోకి మరో 30 వేల కుటుంబాలు వచ్చే అవకాశం ఉందని ఓ రియల్‌ ఎస్టేట్‌ సంస్థ అంచనా వేసింది. ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్నవి, భవిష్యత్తులో నిర్మాణాలు జరగాల్సిన స్థలాల్లో మరో 80 వేల కుటుంబాలు వచ్చి చేరే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఉన్న జనాభాతో ఏమాత్రం సరిపోని రోడ్లు ఇక భవిష్యత్‌లో ట్రాఫిక్‌ పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఫ్లై ఓవర్‌లు నిర్మించాల్సిందే..

గండిపేట మండల పరిధిలోని మూడు మున్సిపాలిటీల మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు భారీగా పెరిగిపోతుండటం, రాబోయే రోజుల్లో ఆ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉండటంతో ఉన్న రోడ్లను మరింత వెడల్పు చేయటం, ట్రాఫిక్‌ సిగ్నల్‌లను ఏర్పాటు చేయటంతో పాటు అవసరమయిన చోట ఫ్లై ఓవర్‌లను నిర్మించాలనే డిమాండ్‌ తెరమీదకు వస్తుంది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్‌ సర్కిల్‌లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో గంటల కొద్ది ట్రాఫిక్‌ జాంలు ఏర్పడుతున్నాయి. దీంతో అక్కడ ఫ్లై ఓవర్‌ నిర్మించాలని వాహనదారులు డిమాండ్‌ చేస్తున్నారు. ఇదే తరహాలో నార్సింగి సర్కిల్‌లోను గండిపేట వైపు వెళ్లేందుకు ఫ్లైఓవర్‌ నిర్మించాలని కోరుతున్నారు. అలాగే మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీరాంనగర్‌ కాలనీ ప్రవేశం, బండ్లగూడ, కాళీ మందిర్‌ల వద్ద ఫ్లై ఓవర్‌లు నిర్మించాలనే డిమాండ్‌లు వస్తున్నాయి. నిర్మాణ రంగ అనుమతుల ద్వారా వందల కోట్ల ఆదాయాన్ని పొందుతున్న హెచ్‌ఎండీఏ రోడ్ల సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.



ట్రాఫిక్‌ సిగ్నల్‌ లేని నార్సింగి సర్కిల్‌

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462